
www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 27 మే 2024



మానవత ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఆదివారం 53వ రోజు కూడా మానవతా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీని నిర్వహించారు. చాగల్లు మానవత శాఖ ఆధ్వర్యంలో చాగల్లు మెయిన్ రోడ్ శ్రీకాకతీయ కళ్యాణమండపం సెంటర్ వద్ద ఆదివారం మజ్జిగను పంపిణీ చేశారు. వరుసగా 53వ రోజు మజ్జిగను పంపిణీ చేశారు. కోరంగి సత్యలింగేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు కోరంగి సతీష్, కాశీవిశ్వనాథ్, వెంకట చంద్రరావు, కుటుంబసభ్యుల ఆర్థిక సాయంతో మజ్జిగను పంపిణీ చేశారు. దాతలకు చాగల్లు మండలం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరుపున కృతజ్ఞతలు తెలిపారు వేసవి తీవ్రత తగ్గేవరకూ ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రతినిధులు తెలిపారు.

కాలుష్యం కోరల్లో కోనసీమ

- భూగర్భ జలాలు కలుషితం
- ఆక్వా సాగే కారణం
- తాగునీరు దొరకడం కష్టమే...!
- తీర ప్రాంతాల్లో మూగజీవాలకు అందని నీరు



ఆక్వా కారణంగా మోడు బారిన కొబ్బరి చెట్లు

ప్రజాశక్తి-రాజోలు

పచ్చని తివాచీ పరిచినట్లుగా ఉండే కోనసీమ.. పైకి పచ్చగా కనిపిస్తున్నా భూమి లోపల నుంచి ముప్పు ముంచుకొస్తోంది. ఆక్వా సాగు, చమురు సంస్థల సహజ సంపద వెలికితీత కార్యకలాపాలు, సముద్ర, గోదావరి తీరాల్లో ఇసుక అక్రమ తవ్వకాల కారణంగా భూగర్భ జలాలు పాడై జలవనరులు తగ్గిపోతున్నాయి. ఇప్పుడవి ఉప్పు మాయ మవుతున్నాయి. ఫలితంగా చుట్టూ నీరున్నా తాగేందుకు పనికిరావడం లేదు.

కోనసీమ 1550.60 చదరపు కి.మీ విస్తీర్ణంలో సుమారు 175 గ్రామాలతో ఉంది. ఇక్కడ సాగర తీరం వెంట దాదాపు 55 గ్రామాలున్నాయి. ఒకప్పుడు ఏ గ్రామం వెళ్లినా అక్కడ బావుల్లో తాగునీరు దొరికేది. ఊరుమ్మడి చెరువులు, బావుల్లోనూ ఆరోగ్యపరమైన తాగు నీరు వచ్చేది. ఇప్పుడు మానవ తప్పిదాల కారణంగా రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు, పి.గన్నవరం, అల్లవరం, అమలాపురం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, అయినవిల్లి మండలాల్లోని సుమారు 130 గ్రామాలు ఉప్పునీటి బారిన పడ్డాయి ఇప్పటికే కోనసీమలో సుమారు 75 గ్రామాల వరకూ ఉప్పునీటి కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయి. దాదాపుగా 890 చదరపు కి.మీ్ల విస్తీర్ణానికి ముప్పు వాటిల్లిందని పర్యావరణ కాలుష్యంపై పరిశోధనలు చేసిన రసాయన శాస్త్ర నిపుణులు చెబుతున్నారు.

అక్రమ ఆక్వా సాగుతో...!

ఒకప్పుడు సముద్రం, గోదావరి తీరాలకు పది కిలోమీటర్ల వరకూ పంట పొలాలు ఉంటే ఇప్పుడు వాటిని ఆక్వా చెరువు లుగా మార్చేశారు. రాజోలు మండలంలోని చింతలపల్లి మధ్యలోనే రొయ్యల చెరువులు విస్తరించాయి. కోనసీమ వ్యాప్తంగా సుమారు 42 వేల ఎకరాల్లో ఆక్వాసాగు జరుగుతుందని అంచనా. వాటిలో 90శాతం చెరువు లకు అనుమతులు లేనప్పటికీ అధికారు లెవరూ పట్టించుకోవడం లేదు. పైగా ఆక్వా సాగు మొత్తం రసాయనాల మీదనే నడుస్తోంది. ఇటీవల కాలంలో ఇది మరీ పెరిగింది. అయితే వాటి వినియోగం వల్ల బాహ్య భూముల్లోనూ ప్రభావం చూపుతుంది. ఎండోసల్ఫాన్, నివాన్, పార్మిలిన్, అయోడిన్ వంటి రసాయన ఎరువుల వినియోంతో ఇబ్బందులు వస్తున్నాయి. ఫలితంగా సముద్రతీర ప్రాంతాల్లో 130 గ్రామాల్లో తాగునీటి బావులు ఉప్పునీటి భూతాల య్యాయని గ్రామస్తులు చెబుతున్నారు.



సఖినేటిపల్లి లో కలుషితమైన భూగర్భ జలం

ఉప్పమయం అయిన భూగర్భ జలాలు

కోనసీమలో 15 ఏళ్లక్రితం సముద్రతీరం వెంట ఉన్న గ్రామాల్లోని బావుల్లో మంచినీరు లభించేది. ఇప్పుడు తీరానికి 15 నుంచి 25 కి.మీ దూరాల్లో ఉన్న గ్రామాల్లో భూగర్భ జలాలు ఉప్పునీటి వనరులుగా మారిపోయాయి. మరో ఐదేళ్లలో ఈస్థాయి 25 నుంచి 30 కి.మీవరకూ పెరిగే అవకాశాలుఉన్నాయి. ఇక్కడ 15ఏళ్ల కాలాన్ని ప్రాతి పదికగా తీసుకుంటే కేవలం సముద్ర, గోదావరి తీరాల్లో 12 మండలాల్లో దాదాపుగా సుమారు 20 వేల ఎకరాల వరకూ ఉప్పు ప్రభావంతో చౌడుబావులు పడ్డాయని తెలుస్తోంది. లీటరు తాగునీటిలో 1500 మిల్లీ గ్రాముల కంటే లవణ సాంద్రత ఎక్కువైతే ఆనీరు ఉప్పుగా ఉంటుంది. అదే 2000 మి.గ్రా కంటే ఎక్కువ లవణ సాంద్రత ఉంటే ఆనీరు వినియోగానికి పనికిరాకుండా పోతోంది. అదే 3 వేల మి.గ్రా కంటే లవణ సాంద్రత ఎక్కువ అయితే ఆ భూములు చౌడుబారిన పడతాయని నీటి పరిశోధకులు వై. విజయ్ తెలిపారు. ప్రస్తుతం కోనసీమలో లవణాల సాంద్రత 2,500 మిల్లీ గ్రాములు ఉంటుందని అంచనా.

గుల్లబారుతున్న భూములు

కోనసీమలోని వివిధ చమురు సంస్థల కార్యకలాపాల కారణంగా సుమారు 275 గ్రామాల్లో భూములు గుల్లబారుతున్నాయి. భూమిలో అపార లోతుకు వెళ్లి చమురు, సహజ వాయువులను వెలికి తీస్తున్నాయి. సాధారణంగా సహజ వనరులను వెలికి తీసిన తర్వాత భూమిలోకి వేరే ద్రవంతో నింపాలి. దీంతో అక్కడ శూన్యం ఏర్పడదు. ఇటీవల కాలంలో వెలికితీత ముగియగానే ఆ భూగర్భంలోని ప్రాంతాన్ని ఖాళీగానే వదిలేస్తున్నారు. దీంతో భూమికి కొద్దిపాటి అడుగుల లోతులో ఉండే మంచినీటి పొరలు దెబ్బతింటున్నాయి. ఎప్పుడైతే మంచినీటి పొరలు దెబ్బతిం టున్నాయో అప్పుడు ఆ పొరల్లోకి ఉప్పునీరు ఉబుకుతూ వస్తోంది. తద్వారా భూములన్నీ చవుడుబారుతున్నాయి. ఇలాగే కొనసాగితే భూ, జల కాలుష్యం మితిమీరి కోనసీమ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదసూచికలు కనిపి స్తున్నాయని ప్రస్తుతం కోనసీమ భూగర్భ జలాలపై పరిశోధనలు చేస్తున్న రాజోలు మండలానికి చెందిన రసాయనిక నిపుణులు ఎం.దుర్గా ప్రసాద్ తెలుపుతున్నారు.

ఇసుక తిన్నెలు తరలి పోవడంతో...!

గోదావరి లంకల్లో గరుకు ఇసుక తిన్నెల వన్నె క్రమక్రమంగా తగ్గిపోతుంది. కొందరు అక్ర మార్కులు తీరంలోని ఇసుకను తవ్వుకు పోతున్నారు. ఈ కారణంగా భూగర్భ జలాలను కాపాడే ఇసుక తరిగి పోతోంది. ఆ ప్రాంతాల్లోకి ఉప్పునీరు చొచ్చుకుపోతోంది. సముద్ర తీరంలో సుమారు 50 మీటర్ల ఎత్తు ఉన్న ఇసుక తిన్నెలు అక్రమ తవ్వకాలతో 60 మీటర్ల లోతుపారుతున్నాయి. తాగునీటి వనరులు ఉప్పుగా మారుతున్నాయి.

రాజులోవ మృతి పార్టీకి తీరని లోటు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - రౌతులపూడి

రాజులోవ మృతి పార్టీకి తీరని లోటు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ శనివారం మృతి చెందిన విషయం విదితమే. ఆయన అంత్యక్రియలు రౌతులపూడి మండలం ములగపూడిలో ఆదివారం జరిగాయి. ఈ అంత్యక్రియలకు ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. అనంతరం సిపిఎం కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అధ్యక్షతన సంతాప సభను నిర్వహించారు. ఈ సభలో ఉమామహేశ్వరరావు మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి ఎస్ఎఫ్ఐ పట్ల ఆకర్షితులై అంచెలంచెలుగా ఎదిగి పార్టీకి సేవలు అందించారన్నారు. రాజులోవ మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి అరుణ్ మాట్లాడుతూ తన కుటుంబం కన్నా పార్టీ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేశాడన్నారు. విద్యార్థి సంఘం నాయకునిగా, యువజన సంఘం, పౌర సంక్షేమ సంఘం నాయకునిగానూ సేవలు అందించారన్నారు. ఆయన మరణం పార్టీకి, కుటుంబానికి తీవ్ర నష్టమని తెలిపారు. సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి మాట్లాడుతూ సమస్యలపై తక్షణం స్పందించే నాయకుడు రాజులోవ అన్నారు. చిన్నవయస్సులోనే మరణించడం బాధాకరమన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము మాట్లాడుతూ డివైఎఫ్ఐ యువజన సంఘం నాయకునిగా రాజులోవ పలు పోరాటాలు చేశారన్నారు. నిరుద్యోగం, డిఎస్సిలపై చేసిన పోరాటాల్లో భాగస్వామి అయ్యారన్నారు. విజయవాడ ఎంబివికె బాధ్యులు టి.క్రాంతి మాట్లాడుతూ విద్యార్థి సంఘం నాయకునిగా ఉన్నప్పటి నుంచి రాజులోవతో పరిచయం ఉందన్నారు. చిన్నవయస్సులోనే కార్మిక సంఘం నాయకునిగా ఎదిగాడన్నారు. నిబద్ధతతో పనిచేశాడన్నారు. ఆయన మృతి బాధాకరమన్నారు. సిఐటియు ఏలూరు జిల్లా కార్యదర్శి డిఎన్విడి.ప్రసాద్ మాట్లాడుతూ కార్మిక సంఘం నాయకునిగా రాజులోవ పలు పోరాటాల్లో భాగస్వాములు అయ్యారన్నారు. కార్మికులకు ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు రాజులోవ మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేశారు. రాజులోవ చిన్నాన్న రాజుబాబు మాట్లాడుతూ 20 ఏళ్లగా రాజులోవ ఉద్యమంలో ఉన్నాడన్నారు. కుటుంబం కంటే ఉద్యమానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడన్నారు. వందలాది మందితో కలిసి ఉద్యమాల్లో పాల్గొన్నాడు. నేడు వందలాది మంది నాయకులు, కార్మికులు మధ్య అమరుడయ్యాడని కంటతడిపెట్టుకున్నారు. ఈ అంత్యక్రయిల్లో సిఐటియు తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు సుందర్‌బాబు, జిల్లా సీనియర్ నాయకులు ఎస్-ఎస్.మూర్తి, సిపిఎం రాజమహేంద్రవరం నగర కార్యదర్శి బి.పవన్, సిపిఎం సామర్లకోట మండల కార్యదర్శి కరణం ప్రసాద్. అంగన్‌వాడీ టీచర్స్, అండ్ హెల్పర్స్ యూనియన్ తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి వై.బేబిరాణి, కోనసీమ జిల్లా కార్యదర్శి కృష్ణవేణి, సిఐటియు నాయకులు ఎస్‌కె.పద్మ, ఐద్వా నాయకులు పి.తులసి, పి.స్రవంతి, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.పోసమ్మ, అన్నామణి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎన్.రాజా, వి.రాంబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు గంగ సూరిబాబు, వరహాలు, ప్రజాసంఘాల నాయకులు పి.మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు, రాము, కె.రామకృష్ణ, సిపిఎం, ప్రజా సంఘాలు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.



రాజులోవ భౌతికకాయంపై అరుణపతాకాన్ని కప్పుతున్న అరుణ్,రాజశేఖర్, బేబిరాణి



రాజులోవకు నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

బిక్కవోలులో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - బిక్కవోలు

సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అల్లర్లు జరిగే అవకాశం ఉన్న సున్నిత ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు(కార్డెన్ అండ్ సెర్చ్) నిర్వహిస్తున్నామని అనపర్తి సిఐ శివగణేష్ తెలిపారు. దీనిలో భాగంగా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బలబద్రపురంలో ఆదివారం తెల్లవారుజామున అనపర్తి సిఐ ఆధ్వర్యంలో తాతానగరం గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 26 మోటార్ బైకులను సీజ్ చేశారు. అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. అతని నుంచి 10 లిక్కర్ బాటిల్లు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు. అనంతరం బిక్కవోలు ఎస్ఐ బుజ్జి బాబు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వేళ ప్రజలు సంయమనం పాటించాలన్నారు. ఎటువంటి గొడవలు, ఘర్షణల్లో ఉండకూడదన్నారు. ఎన్నికలకు ఫలితాలు నేపథ్యంలో ఆ ప్రాంతానికి సంబంధం లేని బయట వ్యక్తులకు ఆశ్రయం కల్పించడం, ఎన్నికల ఫలితాల అనంతరం బాణాసంచా కాల్చడం, విద్వేషపూరిత ప్రసంగాలు, ఆకతాయి చేష్టలు చేయడం నేరమన్నారు. ఇలాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నేటి నుంచి కౌన్సిలింగ్ జరుగనుంది. బొమ్మూరులోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో దీనికి సంబంధించిన ఏర్పాట్లను చేశారు. పాలిసెట్ కన్వీనర్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వి.నాగేశ్వరరావు ఈ వివరాలను వెల్లడించారు.



సోమవారం నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకూ విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. షెడ్యూల్‌లో ప్రకటించిన ప్రకారం ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుంది. విద్యార్థులు వారి ర్యాంకుల ప్రకారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఒసి, బిసి కేటగిరీల వారు రూ.700, ఎస్సి, ఎస్‌టి విద్యార్థులు రూ.250 చొప్పున ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి ప్రాసెసింగ్ ఫీజుతో పాటూ పాలిసెట్ హాల్ టిక్కెట్, ర్యాంకు కార్డు, పదోతరగతి హాల్ టిక్కెట్, ర్యాంకు కార్డు, ఒరిజినల్ మార్కుల జాబితా లేదా ఇంటర్నెట్ కాపీని తీసుకుని రావాలి. నాలుగు నుంచి పదోతరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్ లేదా రెసిడెన్షియల్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ వారికి 2021 జనవరి 1 తర్వాత జారీ చేసిన ఆదాయ, కుల ధ్రువీకరణపత్రాలు, టిసి, ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులు అందుకు సంబంధించి సర్టిఫికెట్లు తీసుకుని రావాలి.

ప్రత్యేక కేటగిరీ విద్యార్థులు(ఎన్‌సిసి, ఆంగ్లో ఇండియన్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, సిఏపి, పిడబ్ల్యూడి, స్కౌట్స్ అండ్ గైడ్స్), విజయవాడ బెంజి సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఈ నెల 31 నుంచి వచ్చే నెల 3వ తేదీలోగా హాజరు కావాల్సి ఉంటుంది.

విద్యార్థులకు ఈ నెల 31 నుంచి వెబ్ ఆప్షన్లను ఎంపిక చేసుకోవచ్చు. ఈ నెల 31 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకూ 1 నుంచి 50వేల రాంకులు పొందిన వారు, జూన్ 2, 3 తేదీల్లో 50,001 - 90000 ర్యాంకుల వారు, 4, 5 తేదీల్లో 90001 నుంచి చివరి ర్యాంకు వరకూ విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చు.

ఆప్షన్లు మార్చుకునేందుకు జూన్ 5న అవకాశం ఇస్తారు. జూన్ 7న కళాశాలల్లో సీట్ల కేటాయింపు ఉంటుంది. వివరాలకు https://appolycet.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

ర్యాంకుల వారీగా షెడ్యూల్

మే 27 : 1-12,000
మే 28 : 12,001-27,000
మే 29 : 27,001-43,000
మే 30 : 43,001-59,000
మే 31 : 59,001-75,000
జూన్1 : 75,001- 92,000
జూన్2 : 92,001-1,08,00
జూన్3 : 1,08,001- చివరి ర్యాంకువరకూ

విజయవాడ ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల షెడ్యూల్ ఇలా

మే 31 : ఎన్‌సిసి 1- 40,000
ఆంగ్లో ఇండియన్ 1- చివరిర్యాంకు వరకూ
జూన్ 1 : స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 1-60,000
ఎన్‌సిసి 40,001 - 80,000
జూన్ 2 : స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 60,001- చివరిర్యాంకు వరకూ
ఎన్‌సిసి 80,001 - చివరి ర్యాంకు వరకూ
జూన్ 3 : సిఏపి, పిడబ్ల్యూడి, 1 - చివరి ర్యాంకు వరకూ స్కౌట్ అండ్ గైడ్స్



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కామినేని తదితరులు

రాజకీయాల్లో కృష్ణబాబుది ప్రత్యేక ముద్ర

ప్రజాశక్తి - కొవ్వూరురూరల్

కొవ్వూరు మాజీ ఎంఎల్ఎ, పారిశ్రామిక వేత్త పెండ్యాల కృష్ణబాబుకు పశ్చిమ గోదావరి జిల్లా రాజకియాల్లో ప్రతేకమైన ముద్ర ఉందని ఆరోగ్యశాఖ మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం దొమ్మేరులో కృష్ణబాబు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాస్‌చంద్రబోస్, ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర, కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం ఉమ్మడి అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు, తాడేపల్లిగూడెం టిడిపి ఇన్‌చార్జ్ వలవల మల్లికార్జునరావు, వైద్యులు డాక్టర్ జివి.కృష్ణారావు, డాక్టర్ సాంబశివరావు కృష్ణబాబు మృతికి సంతాపం తెలిపారు. కుటంబ సభ్యులైన పెండ్యాల అచ్చిబాబు, కృష్ణబాబు అల్లుడు ఎస్.రాజీవ్‌కృష్ణలను కలసి మృతికి సంతాపం తెలిపారు. వీరితో పాటుగా కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు మద్దిపట్ల శివరామకృష్ణ, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గోపాలపురం

గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ పాలకులు వెజ్జు సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం 12వ రోజు చిన్నారులతో నీతి కథలు చెప్పారు. స్థానిక రిసోర్స్ పర్సన్ నాగరాజు చరిత్రకారుల గురించి వివరించారు. చిన్నారులకు వేమన పద్యాలు, సుమతీ శతకాలను తాత్పర్యాలతో వివరించారు. జనరల్ నాలెడ్జ్ బిట్స్ మొదలగునవి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమం జూన్ 7వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు సెల్ ఫోన్లు టెలివిజన్లకు అలవాటు పడకుండా గ్రంథాలయంలో ఉండే పుస్తకములను చదువుతూ భవిష్యత్తుగా బంగారు బాటలు వేసుకోవాలని ఆయన సూచించారు.

స్వర్ణాంధ్ర కృషి అభినందనీయం


ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మహిళలకు శిక్షణ ఉపాధి కల్పించడం కోసం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని 26 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర సేవలు అభినందనీయమని ఎల్ఐసి రాజమండ్రి డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి అన్నారు. స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో జరిగిన ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను స్వయంగా పరిశీలించారు. సమాజంలో మహిళలు స్వయంవృద్ధి సాధిస్తే సమాజం ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతుందని సంధ్యారాణి అన్నారు మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ మగ్గం, బ్యూటీషియన్ కంప్యూటర్లలో ఉచిత శిక్షణ అందిస్తూ వారి జీవనోపాధి కోసం కుట్టుమిషన్లు ఉచితంగా అందించడం మహిళల్ని ప్రోత్సహించడమేనని అన్నారు స్వర్ణాంధ్ర నిర్వహణలో శ్రమిస్తున్న రాంబాబు వారి బృందాన్ని అభినందించారు. స్వర్ణాంధ్ర చేస్తున్న ఉచిత అన్నదాన సేవ వృద్ధాశ్రమ నిర్వహణ ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ఇప్పటివరకు సుమారు 20వేల మందికి పైబడి ఉచితంగా శిక్షణ అందించామని, సుమారు 750 మందికి ఉచితంగా కుట్టు మిషన్లు అందించి వారి ఉపాధికి ఊతం ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా అయిదుగురు మహిళలకు సంధ్యారాణి చేతుల మీదుగా కుట్టుమిషన్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి సేల్స్ మేనేజర్ బి.శ్రీనివాస్, దివ్యగౌరీ, గంగాధర్ స్వర్ణాంధ్ర సిబ్బంది శ్రీనివాస్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర పక్షాన సధ్యారాణిని దుస్సా లువతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు.



కుట్టుమిషన్లను అందజేస్తున్న సంధ్యారాణి

కార్టూ'నిజం'



బట్టీలేని విద్య గోల్డెన్ కిడ్స్ సొంతం



బి.ఉమ
సెక్రటరీ అండ్ కరస్పాండెంట్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కష్టపడి కాకుండా, ఇష్టపడి విద్యనభ్యసించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో గోల్డెన్ కిడ్స్ విద్యాసంస్థను స్థాపించినట్లు సెక్రటరీ మరియు కరస్పాండెంట్ బి.ఉమ తెలిపారు. సంకల్పం సాధారణమైనదే అయినప్పటికీ దానిని సాధించడంలోనే సంకల్పానికి విలువ ఉంటుందని ఆమె అన్నారు. చిన్న పట్టణాల్లో, గ్రామస్థాయి విద్యార్థులకు సైతం కార్పొరేట్ స్థాయి విద్యనందించాలనే ఆశయం తనదన్నారు. భావి భారత విద్యార్థులు భవిష్యత్తులో ఏ రంగంలోనైనా అభివృద్ధి చెందడానికి కావాల్సిన కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేయడమే ప్రధాన ఏజెండాగా పాఠశాలను స్థాపించామన్నారు. కేవలం 30 మంది విద్యార్థులతో 2021 సంవత్సరంలో రణగొణ ధ్వనులకు దూరంగా ఉండ్రాజవరం మండలం, పాలంగి గ్రామంలో గోల్డెన్ కిడ్స్ పాఠశాలను ప్రారంభించామని తెలిపారు.



గోల్డెన్‌కిడ్స్ విద్యాసంస్థ భవనం

తమ పిల్లలకు బంగారు భవిష్యత్తు నివ్వాలని ప్రతి తల్లిదండ్రులు కోరుకుంటారు, చిన్నతనం నుంచి విద్యా బుద్ధులు నేర్పించి, ఉన్నత స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షిస్తారు. ఇదే స్ఫూర్తితో తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా తమ బంగారు బిడ్డల భవిష్యత్తు మా చేతుల్లో పెట్టండి అంటూ ఆమె విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. సొంత భవనం, విశాలమైన తరగతి గదుల్లో, సిబిఎస్ఇకు దీటుగా తన స్వీయ పర్యవేక్షణలో స్థాపించిన విద్యాసంస్థ గోల్డెన్ కిడ్స్ అని ఆమె తెలిపారు. స్వశక్తి, ఆలోచనా జ్ఞానంతో, ప్రాజెక్టు రూపకల్పన చేసి, విద్యార్థి మేధాశక్తికి పదును పెట్టే విధంగా, సహచర ఉపాధ్యాయ బందంతో కలిసి కృషి చేస్తున్నారు. స్థాపించిన రెండవ సంవత్సరానికే 300 మంది, మూడవ విద్యా సంవత్సరానికి 450 మంది విద్యార్థులు తమ పాఠశాలలో అడ్మిషన్ పొందారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ద్వారా తమ పాఠశాల పొందుతున్న ప్రచారానికి ఈ గణాంకాలు నిదర్శనం అన్నారు. ఈ సందర్భంగా తమ విద్యాసంస్థపై నమ్మకం ఉంచిన విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు.

ఉత్తరాంధ్ర గ్రామీణ ప్రాంతంలో విద్యనభ్యసించిన సెక్రటరీ మరియు కరస్పాండెంట్ బి.ఉమ ఆంధ్ర యూనివర్సిటీ నుంచి ఎంబిఎ పొందారు. ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో 2009లో పశ్చిమగోదావరి జిల్లా, తణుకు పట్టణంలోని ఒక ప్రైవేటు విద్యాసంస్థలో ప్రిన్సిపాల్‌గా సుమారు 15 సంవత్సరాల పాటు సేవలందించారు.



నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట మండలం రామవరం జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. హైవే పోలీసులు తెలిపిన వివరాల మేరకు విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ప్రయివేట్ ట్రావెల్ బస్సు ముందు వెళ్తున్న కారును ఢీకొంది. దీంతో కారు అదుపుతప్పి పక్కన ఉన్న కర్రల లోడుతో ఉన్న ఐసర్ వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని హైవే అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందారు. వారి వివరాలు తెలియాల్సి ఉంది.

పేకాట శిబిరంపై దాడులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆత్రేయపురం కోటేరు పుంత రోడ్డులో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ముదునూరి రామరాజు గెస్ట్ హౌస్‌పై ఆదివారం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులో తీసుకున్నామని ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.11,970 నగదును స్వాధీనం చేసుకుని, 8 మొబైల్స్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. 9 మందిని వ్యక్తిగత పూచికత్తుపై 41 సిఆర్‌పిసి కింద బెయిల్ మంజూరు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

విచ్చలవిడిగా పెట్రేగిపోతున్న మట్టి మాఫియాకు చెందిన లారీ వేగానికి ఒక వ్యక్తి బలయ్యాడు. ఢీ కొట్టిన తరువాత లారీని రివర్స్ చేస్తూ మరోసారి ఆ వ్యక్తిపై లారీని ఎక్కించారు. దీంతో మృతదేహం అవయవాలు చల్లాచెదురుగా పడ్డాయి. ఈ విషాద సంఘటన రాజానగరం మండలంలో జి.ఎర్రంపాలెం గ్రామంలో ఆదివారం జరిగింది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రాజమహేంద్రవరం నగరానికి చెందిన అంగారపు సురేష్(37) మోటారు సైకిల్ పై నామవరం శుభకార్యానికి వెలుతున్నాడు. సంపత్ నగరం నుంచి పుణ్యక్షేత్రం వైపు వెళ్లేందుకు వెలుతున్న భారీ లారీ మార్గమధ్యంలో జి.ఎర్రంపాలెంలో మోటారు సైకిల్‌ను ఢీ కొట్టాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఢీ కొట్టిన అనంతరం రివర్స్ చేయడంతో మృతుడి శరీరభాగాలు ఛిద్రమయ్యాయి. రహదారిపై చల్లాచెదురుగా పడ్డాయి. చేతులు రెండూ విడిపోయి, పొట్టలో అవయవాలు బయటకు వచ్చి, తల నా భాగం రహదారికి అతుక్కుపోవడంతో ఈ ప్రమాదం చూపరులను తీవ్రభయాందోళనకు గురిచేసింది. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై రాజానగరం పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు ఆవులు మృత్యువాత

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎస్.యానాంలో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై రెండు ఆవులు అక్కడికక్కడే మత్యువాత పడ్డాయి. పంచాయతీ పరిధిలోని బిల్లపరిపాలెం ఒఎన్‌జిసి ఎర్ర సైట్ పాయింట్ కు వచ్చిన ఆయిల్ లారీ ట్యాంకర్ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపడి అక్కడే ఉన్న ఆవులపై విద్యుత్ తీగలు పడ్డాయి. దీంతో రెండు ఆవులు విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మత్యువాతకు గురయ్యాయి. దీంతో నష్టపరిహారం కోరుతూ ఆవుల యజమానులు గ్రామస్తులు ఒఎన్‌జిసి ఉద్యోగులను నిలదీశారు. ఆవులకు నష్టపరిహారం ఇవ్వాలంటూ ఎంపిటిసిల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, గ్రామ పెద్దలు జోగి రాజా లంకే శ్రీను, పొగాకు శ్రీను, లంకే చిరంజీవి, ఆవుల యజమాని బడుగు రామచంద్ర రావు తదితరులు డిమాండ్ చేశారు.

ఏలేరు కాలువ విషతుల్యం..!

-సాగునీటిలో పరిశ్రమల వ్యర్థాలు
-కాలుష్య జలాలకు అడ్డుకట్ట కరువు

ప్రజాశక్తి - సామర్లకోట

వందలాది ఎకరాల సాగుకు నీటిని అందించే ఏలేరు కాలువ విషతుల్యం అవుతోంది. ఒకపక్క పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థజలాలు, మరోపక్క జంతుకలేబారాలతో కలుషితం అవుతోంది. కళ్లేదుటే ఏలేరు కాలువలో జలాలు కాలుష్యం భారిన పడుతున్నా అడ్డుకట్ట వేసే పరిస్థితి కన్పించడం లేదు.

ఏలేరు ప్రధాన కాలువ ద్వారా సరఫరా అయ్యే నీటితో వందలాది ఎకరాలు సాగు అయ్యేవి. ముఖ్యంగా పెద్దాపురం పరిసర ప్రాంతాల నుంచి సామర్లకోట 5 తూములు వరకూ వెళుతున్న ఏలేరు ప్రధాన కాలువలోకి పెద్దాపురం పరిసర ప్రాంతాల్లో గృహాల నుంచి వచ్చే వ్యర్థజలాలతోపాటు, పరిశ్రమల నుంచి విడుదలయ్యే రసాయనాలతో కూడిన వ్యర్థ జలాలు విడుదల అవుతున్నాయి. వీటికితోడు ప్లాస్టిక్ కవర్లు, పశువుల కబేరాలు యథేచ్ఛగా వదిలిపెట్టడం తో జాలాలు కలుషితం అవుతున్నాయి. దీంతో ఏలేరు కాలువ ప్రస్తుతం వ్యర్థ జాలాలు ప్రవహించే డ్రెయిన్ లా మారిపోయింది. ఈ వ్యర్థాలతో


మురికి కాలువను తలపిస్తున్న ఏలేరు ప్రధాన కాలువ

కూడిన నీటినే రైతుల పంటపొలాల్లోకి మళ్లిస్తున్నారు. రసాయనాలతో కూడిన జలాలతో పంట సాగు చేయడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ళ తరబడి ఏలేరు కాలువలో ఇలా ప్రమాదకరమైన వ్యర్థాలు కలుస్తున్నా ఇరిగేషన్ అధికారులు గానీ, కాలుష్య నియంత్రణ అధికారులు గానీ చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇటు రైతులతోపాటు, పశువులు, పక్షులు ఈ జలాలను తాగి మృతి చెందుతున్నా యని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు జరుగుతున్న నష్టాన్ని అరికడుతూ ఇప్పటికైన పర్యావరణ, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏలేరు ప్రధాన కాలువలో ఎలాంటి వ్యర్థాలు వదిలిపెట్టకుండా పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

యానాం వార్తలు


నల్ల చెరువులో చచ్చి తేలిన చేపలు

మంచినీటి చెరువులో చనిపోతున్న చేపలు

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రజలకు మంచినీటిని అందించే స్థానిక నల్లచెరువులో శనివారం ఉదయం నుంచి చేపలు చచ్చి తేలుతున్నాయి. ప్రజా పనుల శాఖ అధికారులకు సమాచారం అందించిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు పిడబ్ల్యూడి, మత్స్యశాఖ అధికారులు నల్లచెరువులను పరిశీలించారు. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు కారణంగా నీటిలో ఆక్సిజన్ కొరత ఏర్పడిందని, అందువల్లే చేపలు చనిపోతున్నట్లు వెల్లడించారు. నీటిని ల్యాబ్ టెస్టింగ్‌కి పంపిస్తామన్నారు. చనిపోయిన చాపలను చెరువు నుంచి తొలగించే చర్యలు చేపట్టారు. కనకాల పేట చెరువులో చేపల చనిపోయి పది రోజులు కాకుండానే ఇలాంటి సమస్య తలెత్తడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నల్లచెరువును పరిశీలించిన దుర్గాప్రసాద్

ప్రజల ఫిర్యాదు మేరకు సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ మంచినీటి చెరువును పరిశీలించారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఘటన చోటు చేసుకుందని, ముందస్తు చర్యలు చేపట్టలేదన్నారు. తాగునీటి చెరువులో చేపలు చనిపోతుంటే అదే నీటిని ఏ విధంగా ప్రజలకు సరఫరా చేస్తారని ప్రశ్నించారు. ప్రజలు రోగాల భారిన పడకుండా త్వరితగతిన సమస్యకు పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పశువులకు చికిత్స చేసే వారేరీ..?

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రాజపూడి గ్రామీణ పశువుల ఆసుపత్రిలో పశువులకు చికిత్స చేసేవారు కరువయ్యారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజపూడి గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న మూడు గ్రామాలతోపాటు ప్రక్కనే ఉండే మరొక గ్రామానికి ఆదే పశువుల ఆసుపత్రి. అటువంటి పశువుల ఆసుపత్రిలో వైద్యులు లేకపోవడంతో అటెండర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఆసుపత్రికి ఒక జెవి ఓ, ఒక ఆటెండర్ పోస్టులు ఉన్నాయి. అటెండర్ పోస్టు తాత్కాలికమే, జూనియర్ వెటర్నరీ వైద్యుల పోస్టు మాత్రం పర్మినెంట్. ఐతే ఈ ఆసుపత్రిలో పోస్టులో మహిళ వైద్యురాలు నియమితురాలై ఉన్నారు. అమె ఇక్కడ విధులు నిర్వహించాల్సి ఉండగా ఈ ఆసుపత్రి నుంచి కాకినాడకు డీప్యూటేషన్‌పై వెళ్ళారు. డిప్యూటేషన్ అంటే ఆ ప్రదేశంలో సహా ఉద్యోగి లేకుంటే కొన్ని రోజులు బయలుగా పంపుతారు. కానీ అమె సుమారు 2 సంవత్సరాలుగా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. గత కొన్ని నెలలుగా వైద్యురాలు లేక పోవడంతో రాజపూడి, కృష్ణాపురం, సీతారామపురం, జె.కొత్తూరు గ్రామాల పశువుల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు గ్రామాలకు అనువుగా ఉండే ఈ ఆసుపత్రిలో జెవిఒ లేక పోవడంతో మల్లిశాలలోని వైద్యురాలు వచ్చి పశువులకు చికిత్స చేయాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. తక్షణమే ఇక్కడ వైద్యురాలిని నియమించాలని ఆయా గ్రామాల పశు రైతులు కోరుతున్నారు.



రాజపూడిలోని గ్రామీణ పశువుల ఆసుపత్రి


పోటీ పరీక్షలపై శిక్షణ ఇస్తున్న మహమ్మద్ రఫీ

పోటీ పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. మాస్టర్ ట్యూషన్ సెంటర్ నిర్వాహకులు మహమ్మద్ రఫీ, షఫీలు ప్రాథమిక, హైస్కూల్ స్థాయి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో పోటీ పరీక్షలపై అవగాహన పెంచడం వల్ల భయపడకుండా పోటీ పరీక్షల్లో పాల్గొంటారన్నారు. ఎటువంటి పోటీ పరీక్షలోనైనా పాల్గొనే విధంగా విద్యార్థులు సిద్ధపడాలన్నారు. అలాగే కరాటే, కర్రసాముపై దుంగల పూజితా సూర్యశ్రీ, నీలపాల కృష్ణ శిక్షణ ఇచ్చారు. ఈ శిబిరంలో చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ కుమార్, మంజుల, అమృత, సాయి, బంగారం, మణికంఠ, నేహా, రేణుక, కె రవి, కె.పవన్, సాయిరాం పాల్గొన్నారు.


గ్రంథాలయంలో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

పాటలు పాడటంలో శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో ఆదివారం విద్యార్థులకు పాటలు పాడడంలో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో హెచ్‌ఎం రాళ్లపల్లి వెంకటేశ్వరరావు విద్యార్థులకు నీతి కథలు, స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగం బుల్లయ్య, వానపల్లి సత్యనారాయణ, ఎస్.వీరబాబు, కె.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దళిత అధికారులపై ఇసుకాసురుల దౌర్జన్యం

ప్రజాశక్తి - సీతానగరం

ఇసుకను అక్రమంగా తరలించడమే కాకుండా అడ్డుకున్న దళిత అధికారులపై ఇసుకాసురులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఇసుక తవ్వకాలపై సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు సీతానగరం మండలంలో తహశీల్దార్ రెండు టీములతో నిఘా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం ముగ్గుళ్ల గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను విఆర్ఒ చిన్న, విఆర్ఎ దుర్గారావు ఆపారు. వివరాలు అడుగగా విధుల్లో ఉన్నటువంటి అధికారులపై పాలడుగుల రాము కులం పేరుతో దూషించి, వారిని నిర్బంధించాడు. అంతటితో ఆగకుండా విఆర్ఎపై దాడి చేసి ట్రాక్టర్లను తీసుకొని వెళ్లిపోయాడు. దీనిపై విఆర్ఎ గోసాల చిన్న విఆర్ఎ మద్దాల దుర్గారావు సీతానగరం తహశీల్దార్ సూచనలతో సీతానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు పాలడుగుల రాముపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుతో పాటు అక్రమ ఇసుక రవాణాపై కేసు నమోదు చేశారు. మరో కేసులో సుద్దమెట్ట నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని అదుపులోకి తీసుకుని సీతానగరం పోలీసులకు అప్పగించారు. పోలీసులు లారీని స్టేషన్‌కి తరలించారు.



ప్రజల ప్రాణాలతో కాంట్రాక్టర్ల చెలగాటం

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో తాగు నీరందక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఎపి రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక రావులమ్మతల్లి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీరందక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ రెండు మండలాల ప్రజలకు శుద్ధి చేసిన మంచినీరు సరఫరా చేయడానికి భావరం గ్రామంలో అధిక మొత్తంలో నిధులు వెచ్చించి ఫిల్టర్ బెడ్‌లు, ట్యాంక్‌లు ఏర్పాటుచేశారని తెలిపారు. అయితే కరెంట్ లేదనే సాకుతో శుద్ధి చేసిన నీళ్ళు సరఫరా చేయడం లేదని ఆయన విమర్శించారు. గండేపల్లి మండలానికి తాగునీరు అందించే ఫిల్టర్ బెడ్‌లు పాడైపోయాయని కాంట్రాక్టర్ యథావిధిగా తమ బిల్లులు తీసుకుని ఫిల్టర్ బెడ్లు రిపేరు చేయించకుండా, క్లోరినేషన్ చేయకుండా అధికారులతో కుమ్మక్కై కలుషిత నీటిని ప్రజలకు సరఫరా చేస్తూ ప్రజల అనారోగ్యానికి కారణం అవుతున్నారన్నారు. అధికారులు, కాంట్రాక్టర్, రాజకీయ నాయకులతో ఏకమై ప్రజలకు తాగునీరందించకుండా అవకతవకలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎపిఆర్‌సిఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, సహాయ కార్యదర్శి కడితి సతీష్, ఎఐఎఫ్‌టియు నాయకులు అంజిబాబు, సురేష్ పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వీరాంజనేయులు

నిబంధనలకు భంగం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-ఆలమూరు

ఎవరైనా ఎన్ని కల నిబంధనలకు, ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ అన్నారు. మండలంలోని మడికి శివారు నాగులపేటలో ఆదివారం ఆయన స్థానిక ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ చిన్న చిన్న ఘటనలు మినహా ప్రశాంతంగా సాగిందన్నారు. ఇక ఇప్పుడు కౌంటింగ్ ప్రక్రియపై అందరి దష్టి నెలకొందన్నారు. ప్రస్తుతం ఎన్నికల ఫలితాలపై అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారని ఆయన అన్నారు. అయితే ప్రజలు ఎవరికివారు స్వేచ్ఛగా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోల్ ఫలితాల కోసం చర్చలు, వాదనలు, బెట్టింగులు మంచి పద్ధతి కాదన్నారు. గెలిచేది తామే అని రాజకీయ పార్టీల ప్రముఖ నేతలు అంటున్నా వాటిలో తల దూర్చ వద్దని హితవు పలికారు. ఈ నేపథ్యంలో ప్రముఖ వాట్సాప్, ఫేస్బుక్ వంటి సోషల్ మీడియాలలో తమ పార్టీయే గెలుపొందుతుందనే వాదనలు వినిపిస్తున్నాయన్నారు. ఈ వాదనలతో అనేక అల్లర్లు చెలరేగే అవకాశం ఉందని సోషల్ మీడియాను వేదికగా చేసుకుని ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే గ్రూప్ అడ్మిన్ లపై ప్రత్యేక కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ రోజున జరిగిన చిన్నపాటి అల్లర్లను రేపుతూ సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడితే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో ప్రత్యేక ప్రదేశాల్లో గ్రూప్ రాజకీయాలు నిర్వహించిన ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు. పై విధంగా నడుచుకుని మీ భవిష్యత్తు పాడు చేసుకోవద్దని ఎస్ఐ శ్రీను నాయక్ సూచించారు.


మడికి సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీను నాయక్

గుండెపోటుతో స్వీపర్ మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

స్థానిక పోలీస్ స్టేషన్లో స్వీపర్ గా పని చేసే చల్లపల్లి ధర్మరాజు (63) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. ధర్మరాజు నర్సాపురంలో తన అల్లుడు సంవత్సరకానికి ఆదివారం వెళ్లాడు. అయితే అతనికి ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో ఉన్నట్టుండి కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు స్థానికులు తెలిపారు. ధర్మరాజు గత 40 సంవత్సరాలుగా ఆత్రేయపురం స్టేషన్ లో స్వీపర్‌గా పనిచేస్తూ ఎస్ఐలు మరియు సిబ్బంది స్టేషన్కు వచ్చే కక్ష దారుల మన్ననలు పొందాడు.

మునికుమారిని పరామర్శించిన ఎంఎల్‌సి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

పితృ వియోగంతో బాధపడుతున్న హిత కారిణి సమాజ్ ఛైర్మన్ కాశి బాల మునికుమారిని ఎంఎల్‌సి కుడిపూడి సూర్య నారాయణ నగర పంచాయతీ ఛైర్మన్ కమిడీ ప్రవీణ్ కుమార్ లు పరామర్శించారు. నగర పంచాయతీ పరిధిలోని బాలయోగి పేటకు చెందిన ముని కుమారి తండ్రి కటికిదల సుబ్బారావు (ఉద్యోగ సంఘాల జెఎసి మాజీ అధ్యక్షుడు) ఇటీవల అనారోగ్యంతో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆదివారం మునికుమారిని ఆమె స్వగృహంలో పరామర్శించారు. ఈ సందర్భంగా సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పరామర్శించిన వారిలో కోలా బాబ్జి, పెన్మత్స చిట్టిరాజు, నల్లా నరసింహ మూర్తి, జనతా బాబ్జి, నక్కా సర్వేశ్వరరావు, కుడిపూడి త్రినాథ్, కాశి పరివాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మునికుమారిని పరామర్శించిన ఎంఎల్ సి కుడిపూడి

కవులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

సమాజహితం కోసం పని చేసే కవులను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అక్షర తపస్వి డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ సాహితీ సాంస్కతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరు వైఎంహెచ్‌ఏ హాలు నందు శతాధిక పద్య కవితా సంకలనం చేసిన పద్య కవుల సన్మాన కార్యక్రమం ప్రతాప్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో నేరేడుమిల్లి అబ్బులు (ముమ్మిడివరం), బివివి.సత్య నారాయణ (అమలాపురం), పద్య కవితా రంగంలో చేస్తున్న సేవలకు గాను ఘనంగా సత్కరించి, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ సాహితీ మహిళా విభాగ అధ్యక్షురాలు కొల్లి రమావతి జాతీయ అధ్యక్షురాలు చిట్టే లలిత, అధ్యక్షులు శ్రీహరి కోటి, జాతీయ కన్వీనర్ డాక్టర్ టి.పార్థసారథి, ధనాసి, ఉషారాణి, నూకా సంపత్ కుమార్, సామాజికవేత్త ఆలపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పద్యకవిని సత్కరిస్తున్న డాక్టర్ ప్రతాప్

అన్నమయ్య పురస్కార గ్రహీత 'నల్లా'కు సత్కారం

ప్రజాశక్తి-అమలాపురం

పట్టణానికి చెందిన సాహితీవేత్త, శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ నల్లా నరసింహమూర్తికి ఇటీవల చిత్తూరు జిల్లాకు చెందిన ఎఎస్‌ఫౌండేషన్ తిరుపతి సంయుక్తంగా నిర్వహించిన అన్నమయ్య 2024 సాహితీ పురస్కారాన్ని అందజేసింది. పురస్కార గ్రహీత డాక్టర్ నల్లా నరసింహమూర్తిని ఆదివారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ఆవరణలో గల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కార్యాలయంలోజిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వనుము సోమశేఖర రావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడ కవి నరసింహమూర్తి అప్రతిభతో ఎన్నో అవార్డులు సాధించారనిఅన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రంగారావు, రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.గోపాలకృష్ణ, డిఐఇఒ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఎన్‌బి. గంగాధర్ పాల్గొని కవిని అభినందించారు.


కళాకారుడు డాక్టర్ నల్లా నరసింహామూర్తి కి సత్కారం

అనారోగ్యంతో నృత్య కళాకారుడు శ్యామ్ మాస్టారు మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామకు చెందిన నృత్యకళాకారులు, శ్యామ్ మాస్టారు (70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన పలువురికి సాంప్రదాయం నృత్యాలు, శాస్త్రీయ సంగీతంలో శిక్షణ ఇచ్చారు. ఆయన మృతి ద్రాక్షారామ నాటకాల అధ్యక్షులు అధ్యక్షులు నాగిరెడ్డి సతీష్ రావు, సెక్రటరీ సరోజ, ట్రెజరర్ వేమవరపు రాంబాబు, పరిషత్ సభ్యులు, ఇతర కళాకారులు, శ్యామ్ మాస్టారు కుటుంబానికి సానుభూతిని తెలియ చేశారు. ద్రాక్షారామ ఉపాధ్యాయులు, పలువురు శ్యామ్ మాస్టారు మృతికి సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లి జడ్‌పిఉన్నత పాఠశాలకు చెందిన 2011 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం మల్లేపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులంతా కలిసి వారి యొక్క యోగక్షేమాలను, పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనం ఎంతో ఆనందదాయకంగా ఉందని, పూర్వపు విద్యార్థులు కలుసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు అంతా కలిసి ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆటపాటలతో రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు